క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ అర్చన

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ తుస్సే అర్చన ఆదివారం రూ.8లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉపసర్పంచ్ తుస్సే దౌలత్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, తుస్సే సంతోష్, ధర్మారావ్, మెంగాజి పటేల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతీరోజు మొక్కలకు నీరు పోయాలి



ఝరిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: నర్సరీల్లో ఉన్న మొక్కలకు ప్రతీరోజు ఉదయం, సాయంకాలం నీరు పోయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని సాకడ, ఝరి, మోడి గ్రామ పంచాయతీల్లో నర్సరీలు, క్రీడాస్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో ప్రతీ మొక్కను సంరక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన క్రీడాస్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

కెరమెరి: మండలంలోని నెహ్రూనగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా సోమవారం నుంచి మార్చి3 వరకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.5,555లు అందించనున్నారు.

ఆడబిడ్డకు జన్మనిస్తే ఉచిత వైద్యం



కాన్పు అనంతరం బిడ్డను తల్లికి అప్పగిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో నూతనంగా ప్రారంభించిన షణ్ముఖ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం ఆడపిల్ల పుడితే ఉచితంగా వైద్యం అందజేస్తుంది. ఇటీవల ఆస్పత్రిలో కాగజ్‌నగర్ మండలం నామనగర్‌కు చెందిన నిర్మల అనే మహిళ ఆడపిల్లకు జన్మనివ్వగా ఆదివారం ఆమెను డిశ్చార్జి చేశారు. ఆడపిల్లకు జన్మనివ్వడంతో నిర్మలకు ఉచితంగా వైద్యం అందించారు. ఆస్పత్రి యాజమాన్య ప్రతినిధులు యాద వినయ్ కుమార్, సీహెచ్ యాదగిరి, కె.సత్యనారాయణ, జి.అరుణ్ కుమార్, కొలిపాక చంద్రశేఖర్ వైద్యులు డాక్టర్ సుయేషా, నర్సులు సుమలత, ఎం.రత్న ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : ధమాక
కాగజ్‌నగర్
వెంకటరమణ : ధమాక
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.20
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	30
బీరకాయ	40
వంకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	120
అలసంద	40
దొండకాయ	80
సోరకాయ	60
పాలకూర	60
గోబి(పూల్)	40
క్యారెట్	50
చామగడ్డ	80
క్యాబేజి	40
సిమ్లామిర్చి	100

-ఆసిఫాబాద్‌అర్బన్

జనసంద్రమైన 'వెంకన్న' జాతర



స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు



జాతరకు తరలివచ్చిన జనం

కెరమెరి: మండలంలోని వేంకటేశ్వర స్వామి జాతర ఆదివారం జనసంద్రమైంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రారంభమైన జాతర గత 9రోజులుగా కొనసాగుతుంది. ఇన్ని రోజులు అంతంత మాత్రంగానే భక్తులు రాగా ఆదివారం తండోపతండాలుగా తరలివచ్చారు. రెండేళ్ల కరోనా కాలం తర్వాత జాతర నిర్వహిస్తుండడంతో కెరమెరి, వాంకిడి, ఆసిఫాబాద్, సిర్పూర్(యూ), జైనూర్, నార్నూర్ తదితర మండలాలకు చెందిన ప్రజలు భారీగా వచ్చారు. హోటళ్లు, గాజులు, ఆడియో, వీడియో సీడీలు, టాటూ, బొళ్ల దుకాణాలు జనంతో కిక్కిరిసిపోయాయి.



భక్తులకు శఠగోపం ఇస్తున్న అర్చకుడు



ఆట వస్తువుల వద్ద జన సందోహం



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



జాతరలో ఓ దుకాణం వద్ద జనం

హిందూవాహిని మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీతో జిల్లా నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలో ఆదివారం హిందూవాహిని మండల నూతన కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు యోగాచార్య అశోక్ ఆర్య, ఉపాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లోనారే రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా చౌదరి శేఖర్, నాగడె శేఖర్, కార్యవర్గ సభ్యులుగా విజయ్, మహేష్, తానాజీ, రాజు, వినోద్, నానాజీ, మహేందర్, రౌత్ గోపాల్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో ఆదివారం మండల హిందూవాహిని నూతన కమిటీని ఎన్నుకున్నారు. హిందూవాహిని జిల్లా సంయోజక్ యోగాచార్య అశోక్ ఆర్య, రాష్ట్ర సహ సంయోజక్ మల్లికార్జున్, జిల్లా సంయోజక్ ఎల్ములే దత్తు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల సంయోజక్‌గా రాచర్ల సాయికుమార్, సహ సంయోజక్‌గా ఉప్పల వెంకటేశ్, గడ్డల రాజేందర్, మహేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సాయినాథ్, మారుతి, ప్రవీణ్, ప్రకాశ్‌లను ఎన్నుకున్నారు.

పక్కా భవనాల ప్రారంభమెప్పుడో..?



దొడ్డిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్న ఇల్లు

- మండలంలో 17 కొత్త పంచాయతీ కార్యాలయ భవనాలు మంజూరు
- ఒక్కో నిర్మాణానికి రూ.20 లక్షల ఈజీఎస్ నిధులు
- స్థల సేకరణ పూర్తి

వాంకిడి: మండలంలో కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు నూతన కార్యాలయ భవనాలు మంజూరై ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. పక్కా భవనాలు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గతేడాది నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మూడున్నర ఏళ్లుగా అద్దె భవనాలు, శిథిలమైన పాఠశాల భవనాలు, రైతువేదికలలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని, తీవ్ర ఇబ్బందుల నడుమ పాలన సాగించిన పంచాయతీ పాలవర్గాలు, సిబ్బంది పంచాయతీల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు.

సౌకర్యాలు కరువు..

నూతన భవనాల నిర్మాణాలకు ప్రొసిడింగ్స్ వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కొన్ని పాఠశాలల్లో ప్రస్తుతం మన ఊరు మన బడి పనులు పూర్తి కావస్తుండటంతో అక్కడి నుంచి పంచాయతీలను మార్చాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతువేదికలు, ఇళ్లలోనే కార్యాలయాలు నిర్వహిస్తుండగా కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా భవనాల నిర్మాణ పనులు పూర్తిచేసి అప్పగించాలని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు కోరుతున్నారు.

17 జీపీ భవనాలు మంజూరు..

మండలంలో నూతనంగా 17 గ్రామ పంచాతీలు ఏర్పడ్డాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. దొడ్డిగూడ, జైత్‌పూర్, ఖిరిడి, కొమటిగూడ, లెండిగూడ, నవెగాం, పాతగూడ, సామేల, తెజపూర్, వాంకిడి, గోయెగాం గ్రామ పంచాయతీల భవన నిర్మాణ బాధ్యతలను పంచాయత్‌రాజ్ శాఖకు, చిచ్‌పల్లి, దాబా, జంబుల్‌ధరి, నవేధరి, నవేగూడ, పిప్పర్‌గోంది గ్రామ పంచాయతీల నిర్మాణ బాధ్యతలను ఐటీడీఏకి అప్పగించింది. అయితే ఇప్పటివరకు అన్ని జీపీల్లో స్థల సేకరణ పూర్తి కాగా నిర్మాణ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ ఆర్థిక సంవత్సరం లోపు పనులు ప్రారంభం చేయకపోతే మంజూరైన నిధులు ల్యాప్స్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో అధికారులు బిజీగా ఉన్నారు. కాగా ఈజీఎస్ కింద పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సమాచారం.

పనులు త్వరగా ప్రారంభించాలి



నూతనంగా ఏర్పడిన నవేగూడ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నాం. కానీ ప్రస్తుతం పాఠశాలలో మన ఊరు మన బడి పనులు పూర్తయినందున అక్కడ పంచాయతీ కార్యాలయం కొనసాగించడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. పక్కా భవనం నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- మడావి రేణుకబాయి, సర్పంచ్, నవేగూడ

నెల రోజుల్లో ప్రారంభిస్తాం



గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో మొత్తం17 గ్రామ పంచాయతీలకు నూతన కార్యాలయ భవనాలు మంజూరయ్యాయి. అన్నీ పంచాయతీలకు సంబంధించిన స్థల సేకరణ పూర్తయింది. నిర్మాణ పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. ఎట్టిపరిస్థితుల్లోనూ నెలరోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- శివకుమార్, ఎంపీవో, వాంకిడి

బియ్యం ధరలకు రెక్కలు..!

- బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.50లకు పైనే
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు, మిల్లర్లు
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బియ్యం

కౌటాల: రోజురోజుకూ పెరుగుతున్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మాయాజాలం కారణంగానే బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కిలో బియ్యం రూ.55కంటే తక్కువకు దొరకడం లేదు. దీంతో రోజువారీ కూలీలు, చిరువ్యాపారులు, నిరుపేదలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన కొందరు మిల్లర్లు మాత్రం ధాన్యాన్ని బియ్యంగా మార్చి గోదాముల్లో నిల్వ చేసుకొని మంచి రేటుకు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

ధర వింటే దడ..

గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పంట సాగు చేయాలని సూచించడంతో రైతులు అధిక మొత్తంలో సన్నరకం వరిసాగు చేశారు. కానీ తెగుళ్ల సోకి పంట దిగుబడి తగ్గడం, ఆశించిన స్థాయిలో ధాన్యానికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఈసారి సన్నరకం వరి సాగు తగ్గించారు. దీంతో బియ్యం ధరలు పెరిగాయి. ఆర్నెళ్ల క్రితం వరకు తక్కువగా ఉన్న బియ్యం ధర ప్రస్తుతం పెరిగింది. జైశ్రీరాం వరి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.2200 నుంచి రూ.2400 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇదే బియ్యాన్ని దుకాణాదారులు కిరణాషాపుల్లో క్వింటాల్ బియ్యాన్ని రూ.5,500 నుంచి రూ.6వేలకు అమ్ముతున్నారు. దీంతో వరి ధాన్యం కంటే బియ్యం ధర రెండింతలు పెరిగింది. వ్యాపారులు దందా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సామాన్యులపై పెనుభారం..

మార్కెట్‌లో సన్న పాత బియ్యం ధరలు మండుతుండడంతో పాటు కొత్త బియ్యం ధరలు సైతం భారీగా పెరిగాయి. కొన్నేళ్లుగా రూ.3,500 నుంచి రూ. 3,600 మధ్య ఉన్న కొత్త సన్న బియ్యం ధర ఈసారి క్వింటాల్‌కు రూ.4,400 వరకు పెరిగింది. దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాత సాధారణ సన్న రకాలు కిలోకు రూ.48 నుంచి రూ. 58 వరకు ధర పలుకుతున్నాయి. మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

బియ్యం కొనలేం, తినలేం



ప్రస్తుతం మార్కెట్లో ఉప్పు, పప్పు, కారం, నూనె ధరలు మండిపోతున్నాయి. దీంతో పాటు బియ్యం ధరలు పెరగడంతో సన్నరకం బియ్యం కొనలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. బియ్యం కొనుగోలు చేయలేక ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తింటున్నాం. వ్యాపారులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

- టి. మీనా, గృహిణి, యాపలగూడ

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



బియ్యం ధరలు చూస్తే కన్నీరొస్తుంది. బియ్యం ధరలు ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇలాగే ధరలు పెరిగితే మధ్య తరగతి ప్రజలు బతకడం కష్టమే. ప్రభుత్వం సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. ధరలు నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- శంకర్, కౌటాల

'పేదలను ఆదుకుంటాం'



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు విజయ్

తిర్యాణి: పెరిక సంఘంలోని పేదలను ఆదుకుంటామని పెరిక సంఘం మండల అధ్యక్షుడు బుద్దె విజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని గోయగాం గ్రామంలో పెరిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘంలో నిల్వ ఉన్న రూ.లక్షలను పేదల అభివృద్ధి కోసం ఖర్చు చేసేందుకు సమావేశంలో చర్చించి తీర్మానించామన్నారు. సంఘం భవన నిర్మాణానికి నాలుగు గుంటల భూమిని విరాళంగా అందించిన మల్లేశ్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి గోపె సత్తన్న, గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, చుంచు శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు బొడ్డు రవీందర్, శ్రావణ్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించండి..!



రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగుకు వెళ్లే మార్గంలో పోచమ్మ ఆలయ సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 15రోజులుగా పంచాయతీ అధికారులు కాలనీవైపు కన్నెత్తి చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఆలయానికి వెళ్లే భక్తులు చెత్తాచెదారంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు దృష్టిపెట్టి చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

కాసిపేట: నేతకానీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏస్కూరి రాయమల్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నేతకాని కుల హక్కుల పరిరక్షణ సంఘం మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

అక్కెపల్లిలో వనభోజనాలు

చెన్నూర్‌రూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద ఆదివారం వనభోజనాలు ఏర్పాటు చేశారు. కుటుంబ వ్యవస్థ బలోపేతం, సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోకుండా ఉండేందుకు ఈ సామూహిక వనభోజనాలను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎస్ఎస్ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి చెన్నూర్ నుంచి సుమారు 50వరకు కుటుంబాలు హాజరయ్యాయి.

ప్రజల కోసమే 'బీజేపీ భరోసా'

- బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు



మాట్లాడుతున్న హరీష్‌బాబు

చింతలమానెపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు పడుతున్న గోస తెలుసుకోవడం కోసమే బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని కోర్సిని, గంగాపూర్, బాబాపూర్, రణవెల్లి, రవీంద్రనగర్ గ్రామాలలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కోర్సిని గ్రామానికి మంజూరైన రహదారి పనుల్లో అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామగోని తిరుపతిగౌడ్, మండల కార్యదర్శి సుల్కరి ఉమామహేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి బిట్టుపెల్లి సత్తన్న, నాయకులు పురుషోత్తం చారి, నాగపురి మోహన్, ఎల్కరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి

మతసామరస్యాన్ని కాపాడేందుకు పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని చిలకల భీమన్న ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఆలయాన్ని పరిశీలించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మండలంలోని లంబాడిహేటి గ్రామంలో తపస్వి శ్రీసంత్ సేవాలాల్ క్రికెట్ పోటీలను పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బోధనలను, ఆయన ఆశయాలను ఆచరించి సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి గౌడ్, ఉమామహేష్, ఎల్ములే మల్లన్న, భాస్కర్ పాల్గొన్నారు.

భైరవస్వామికి భక్తుల పూజలు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలోని భైరవస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ప్రముఖ పండితులు బాచంపల్లి సంతోశ్‌కుమార్ శర్మ భైరవుడి గొప్పతనం భక్తులకు వివరించారు. రానున్న రోజుల్లో పార్‌పల్లి భైరవక్షేత్రం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని ఆకాంక్షించారు. కాళికమాతకు హారతులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, చెన్నూర్ పట్టణానికి చెందిన మర్వాడీలు కుటుంబసభ్యులతో తరలివచ్చి స్వామివారికి నైవేద్యాలతో పుష్పాలంకరణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.